నమస్తే తెలంగాణ
భద్రాద్రి కొత్తగూడెం
5 | ఖమ్మం, మంగళవారం 6 మే 2025 | BHADRADRI KOTHAGUDEM

తాగునీటి కోసం రోడ్డెక్కిన గ్రామస్తులు

పది రోజులుగా నల్లా నీళ్లు రాకపోవడంతో ఆందోళన

మొండివర్రె రహదారిపై ఖాళీ బిందెలతో బైఠాయించి నిరసన తెలుపుతున్న గ్రామస్తులు

ములకలపల్లి, మే 5 : పది రోజులుగా తాగునీరు రాకపోవడంతో మండలంలోని చవిటిగూడెం పంచాయతీ పరిధి మొండివర్రె గ్రామస్తులు ఖాళీ బిందెలతో సోమవారం రోడ్డుపై బైఠాయించి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా పలువురు గ్రామస్తులు, సీపీఎం నాయకుడు నిమ్మల మధు మాట్లాడుతూ పది రోజుల క్రితం పంచాయతీ మోటర్ చెడిపోవడంతో తాగునీరు అందక ఇబ్బంది పడుతున్నామని, ఈ విషయాన్ని పంచాయతీ కార్యదర్శి మురళికి చెప్పినా పట్టించుకోలేదని మండిపడ్డారు. మిషన్ భగీరథ నీటి ట్యాంకులు శుభ్రం చేయకపోవడంతో ఆ నీటితో అనారోగ్యం బారినపడుతున్నామని, తమకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. వెంటనే అధికారులు స్పందించి తాగునీరు సక్రమంగా అందేలా చూడాలని, నిత్యం నీటి సరఫరా చేయాలని వారు కోరారు. కార్యక్రమంలో గ్రామస్తులు బోర్లా జోగయ్య, కుర్సం బాబు, భారతి, కమలమ్మ, పద్మ, చేను రాధ, మహిళలు పాల్గొన్నారు.

పుల్లయ్యబంజరలో రైతుల నిరసన

వెంటనే ధాన్యం కొనుగోళ్లు చేపట్టాలని డిమాండ్

రోడ్డుపై బైఠాయించి నిరసన వ్యక్తం చేస్తున్న రైతులు

పెనుబల్లి, మే 5 : నెల రోజులుగా కల్లాల్లో ధాన్యం ఆరబెట్టుకొని ఎదురుచూస్తున్నా నిర్వాహకులు కొనుగోళ్లు చేపట్టకపోవడంతో విసుగు చెందిన రైతులు కల్లూరు మండలం పుల్లయ్యబంజర గ్రామంలో సోమవారం కల్లూరు ప్రధాన రహదారిపై బైఠాయించి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా పలువురు రైతులు మాట్లాడుతూ కొనుగోలు కేంద్రాలకు తరలించిన ధాన్యాన్ని అకాల వర్షాల నుంచి కాపాడుకునేందుకు నానా తంటాలు పడుతున్నా కనీసం అధికారులు పట్టించుకోవడం లేదని ఆరోపించారు. మిల్లులు ఖాళీ లేవని, ధాన్యంలో తేమ శాతం రావాలని, కొన్నిరోజులు లారీలు లేవని సాకులు చెబుతూ ధాన్యం కొనుగోళ్లు చేపట్టడం లేదన్నారు. తూకాల్లో తరుగు తీస్తూ నానా ఇబ్బందులకు గురిచేస్తున్నారని ఆరోపించారు. పంట వేసింది మొదలు చేతికొచ్చే వరకు నానా కష్టాలుపడ్డ తాము తీరా అమ్ముకునేందుకు తీసుకొస్తే ఇన్ని ఇబ్బందులు పెడుతున్నారని రైతులు మండిపడ్డారు. కొనుగోలు కేంద్రాల్లో ఎలాంటి ఇబ్బందులు పెట్టకుండా ధాన్యం కొనుగోలు చేయాలని, అప్పటి వరకు కదిలేది లేదంటూ భీష్మించారు. అయితే రైతుల ఆందోళన విషయం తెలుసుకున్న ఎస్సై హరిత అక్కడికి చేరుకుని.. సంబంధిత శాఖల అధికారులతో మాట్లాడి సమస్యను పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. దీంతో రైతులు, పోలీసుల మధ్య కాసేపు వాగ్వాదం జరిగింది. అనంతరం రైతులు ఆందోళన విరమించి వెళ్లిపోయారు.

ఖమ్మం వ్యవసాయ మార్కెట్‌కు వచ్చిన మిర్చి బస్తాలు

ఖమ్మం వ్యవసాయ మార్కెట్‌లో దళారుల ఆగడాలు ఎక్కువవుతున్నాయి. ఎండనక, వాననక అరుగాలం శ్రమించి పండించిన పంట చేతికొచ్చాక అమ్ముకుందామని రైతన్నలు మార్కెట్‌కు తీసుకొస్తే మార్కెట్‌లో కమీషన్‌దారుల రూపంలో ఉన్న దళారులు దోచుకుంటున్నారు. గిట్టుబాటు ధరతో సంబంధం లేకుండా చాలా తక్కువ రేటుకు పంటను అడుగుతున్నారు. మార్కెట్‌లో తిష్ట వేసుకొని కూర్చున్న వ్యాపారులంతా కుమ్మక్కై మిర్చి ధర పెరగకుండా రైతులను నిలువుదోపిడీ చేస్తున్నారు. గతేడాది మిర్చి ధర రూ.22 వేల పైచిలుకు ఉండగా.. ఇప్పుడు సగానికి పడిపోవడంతో రైతన్నలు కుదేలవుతున్నారు. గిట్టుబాటు ధర లేక ఈ ఏడాది అప్పులు పెరగడంతో ఆత్మహత్యలే శరణ్యమంటూ తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. - రఘునాథపాలెం, మే 5

- ఖమ్మం వ్యవసాయ మార్కెట్‌లో ఇష్టారాజ్యం
- రైతులను దోచుకుంటున్న దళారులు
- కష్టపడేది రైతులు.. లాభం పొందేది వ్యాపారులు
- పడిపోయిన మిర్చి, పత్తి ధరలు
- ఆత్మహత్యలే శరణ్యమంటున్న అన్నదాతలు
- పట్టించుకోని అధికారులు, పాలకవర్గం

రైతులకు ఆత్మహత్యలే శరణ్యం

జెండాపాటను ఏమాత్రం ఖాతరు చేయకుండా కమీషన్‌దారులు మిర్చి పంటను కొంటున్నారు. జెండాపాట రూ.13 వేలు పలికితే వ్యాపారులు మాత్రం నెంబర్‌వన్ మిర్చి తెచ్చిన నా పంటను రూ.11 వేలకు అడుగుతున్నారు. పంట పండించేందుకు నానా అవస్థలు పడుతున్నాం. తీరా పంట అమ్ముకుందామనుకుంటే రాష్ట్ర ప్రభుత్వం మద్దతు ధర ప్రకటించడం లేదు. ఇలా అయితే రైతన్నలకు ఆత్మహత్యలే శరణ్యం. – **తేజావత్ మేగ్య, రైతు, తిరుమలాయపాలెం మండలం**

దళారీ చెప్పిందే ధర

ఖమ్మం వ్యవసాయ మార్కెట్‌లో సరైన గిట్టుబాటు ధర కల్పించడంలో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలమైంది. దీనికితోడు మధ్యదళారులు, కమీషన్ వ్యాపారుల జోక్యంతో రైతన్నలు తీవ్రంగా నష్టపోవాల్సి వస్తున్నది. ఇంత జరుగుతున్నా సంబంధిత అధికారులు, పాలకవర్గం మాత్రం ఏమీ పట్టించుకోవడం లేదు. సోమవారం ఖమ్మం వ్యవసాయ మార్కెట్‌కు 40 వేల పైచిలుకు మిర్చి బస్తాలు వచ్చాయి. కానీ.. ధర చూస్తే రూ.13 వేల వద్దనే ఆగిపోయింది. అందుకు ప్రధాన కారణం మార్కెట్‌లో కమీషన్‌దారుల సిండికేట్ వ్యవహారమే అని స్పష్టమవుతోంది. జెండాపాట రూ.13 వేలు పలికితే.. కమీషన్‌దారులు మాత్రం తేమశాతం పేరుతో రైతులను ముంచుతున్నారు. ఖమ్మం ఏఎంసీలో లైసెన్స్ లేని కమీషన్‌దారులే ఎక్కువ ఉన్న విషయం తెలిసిందే. వీరు చెప్పిందే ధరగా నిర్ణయించి రైతులను నిలువుదోపిడీ చేస్తున్నారు. కష్టపడేది రైతులైతే.. లాభం పొందేది మాత్రం దళారులే అన్నట్లుగా ఖమ్మం వ్యవసాయ మార్కెట్‌లో తీరు కనిపిస్తోంది. జెండాపాటగా పలికిన ధరలను కాకుండా తమకిష్టమొచ్చినట్లుగా ధరలను నిర్ణయించి అన్నదాతలను అడ్డంగా దోచుకుంటున్నారు. గత మూడు నెలలుగా పండించిన పంటలను నిల్వ చేసుకొని సరైన ధర పలుకుతుందేమోననే ఆశతో ఎదురుచూసిన రైతులకు మార్కెట్‌లో నిరాశే ఎదురవుతోంది. ఇప్పటివరకు మద్దతు ధర లభించకపోవడంతో చేసేది లేక ఇప్పుడు ఉన్న ధరకు అమ్ముకునేందుకు రైతులు సిద్ధమవుతున్నారు. కానీ.. మార్కెట్‌కు వచ్చిన సరుకుకు ఉన్న కాస్త ధర కూడా తగ్గించి వ్యాపారులు కొనుగోలు చేయడంతో రైతులు తీవ్ర నిరాశకు గురవుతున్నారు. పెద్దపెద్ద చదువులు చదువుకొని ఎలాంటి ఉపాధి అవకాశాలు లేక వ్యవసాయం బాటపట్టిన యువకులు సైతం మార్కెట్‌లో దళారుల బారినపడి మోసపోతున్నారు. ఏడాది పొడవునా కూలి, పురుగు మందుల రేట్లు పెరిగిపోతున్నా.. తాము పండించిన పంటలకు సరైన గిట్టుబాటు ధర మాత్రం రావడం లేదని రైతులు ఆవేదన చెందుతున్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి తాము పండించిన పంటలకు సరైన మద్దతు ధర ప్రకటిస్తూ తమను దళారుల బారినపడకుండా ఆదుకోవాలని వారు వేడుకుంటున్నారు.

తప్పలతడకగా రేషన్ కార్డుల జాబితా

- పాతకార్డులోనే కొత్త వారి పేర్లు
- ఒక జిల్లా నుంచి మరో జిల్లాకు జంప్
- లబోదిబోమంటున్న లబ్ధిదారులు



బొందెల సమ్మయ్య, చిన్నబండిరేవు

మహబూబాబాద్ జిల్లా గార్ల మండలం రేషన్ కార్డులో ప్రత్యక్షమైన బొందెల సమ్మయ్య పేరు



కాశిబోయిన సతీష్, సూరారం

కాశిబోయిన సతీష్ కుటుంబం పేర్లు పాత కార్డులో యాడింగైన వైనం

దుమ్ముగూడెం, మే 5 : రాష్ట్ర ప్రభుత్వం కొత్తగా ప్రవేశపెడుతున్న రేషన్ కార్డుల జాబితా తప్పలతడకగా ఉంటోంది. తాజాగా భద్రాద్రి కొత్తగూడెం జిల్లా దుమ్ముగూడెం మండలంలో ప్రవేశపెట్టిన కొత్త జాబితాను చూస్తే కంగుతినాల్సిందే. ఆయా పంచాయతీల్లో అధికారులు కొత్త రేషన్ కార్డుల జాబితా చదివి వినిపించారు. వాటిలో తమ పేర్లు రావడంతో లబ్ధిదారులు సంబురపడ్డారు. తీరా చూస్తే తప్పలతడక విషయం బయటపడింది. సూరారం గ్రామానికి చెందిన కాశిబోయిన సతీష్‌కు 13 ఏళ్ల క్రితం వివాహమైంది. కొత్తకార్డు కోసం దరఖాస్తు చేసుకున్నాడు. కానీ.. తల్లిదండ్రుల పాతకార్డులోనే తన పేరుతో పాటు భార్య, పిల్లల పేర్లు యాడ్ కావడంతో ఒక్కసారిగా కంగుతిన్నాడు. అధికారులను ప్రశ్నించగా.. పాత రేషన్ కార్డులో పేర్లు డిలీట్ చేసి కొత్తకార్డు మంజూరు చేస్తామని సమాధానమిచ్చారు. చిన్నబండిరేవు గ్రామానికి చెందిన బొందెల సమ్మయ్య కొత్త కార్డుకు దరఖాస్తు చేసుకోగా.. తన పేరుతోపాటు ఇద్దరు పిల్లల పేర్లు మహబూబాబాద్ జిల్లా గార్ల మండలం పాత పోచారం గ్రామంలోని తన అత్త రేషన్ కార్డులో కనిపించడంతో షాక్‌కు గురయ్యాడు. ఇదేమిటని అధికారులను ప్రశ్నిస్తే.. తెలియదంటూ తెల్లముఖం వేశారు. ఇలా తప్పులతడకగా రేషన్ కార్డులు మంజూరు చేస్తే ఎలా అంటూ పలువురు మండిపడుతున్నారు. అధికారులు, కిందిస్థాయి సిబ్బంది నిర్లక్ష్యం కారణంగానే తప్పులు దొర్లుతున్నాయని ఆరోపిస్తున్నారు.

శాస్త్రవేత్తల సూచనలు పాటించి

అధిక దిగుబడులు సాధించాలి

ఖమ్మం కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్

మాట్లాడుతున్న కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్

రఘునాథపాలెం, మే 5 : వ్యవసాయరంగంలో శాస్త్రవేత్తల సలహాలు, సూచనలు పాటిస్తూ అధిక దిగుబడులు సాధించి లాభాలు పొందాలని కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్ రైతులకు సూచించారు. సోమవారం రఘునాథపాలెం మండలం ర్యాంకాతండా రైతువేదికలో జరిగిన 'రైతు ముంగిట శాస్త్రవేత్తలు' కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. శాస్త్రవేత్తల సూచనల మేరకు తక్కువ మోతాదులో రసాయన ఎరువులు, పురుగు మందులను వినియోగించాలన్నారు. అవసరం మేరకు రసాయనాలను వినియోగించి నేలతల్లి ఆరోగ్యాన్ని కాపాడాల్సిన అవసరం ఉందన్నారు. అనంతరం వైరా కేవీకే శాస్త్రవేత్త రవికుమార్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం సూచించిన ఆరు అంశాలను రైతులకు వివరించారు. కార్యక్రమంలో జిల్లా రైతుసంఘం నాయకులు నల్లమల వెంకటేశ్వరరావు, జిల్లా వ్యవసాయ అధికారి దినసరి పుల్లయ్య, ఖమ్మం డివిజన్ ఆత్మ చైర్మన్ దిరిశాల చిన్న వెంకటేశ్వర్లు, ఖమ్మంఅర్బన్ ఏడీఏ కొంగర వెంకటేశ్వరరావు, సహకార సొసైటీల అధ్యక్షులు మందడపు సుధాకర్, తాతా రఘురాం, ఏవో ఉమామహేశ్వర్‌రెడ్డి, ఎంపీడీవో అశోక్‌కుమార్, డివిజన్ ఉద్యాన వన అధికారి నగేశ్, విస్తరణాధికారులు ప్రతిభ, వేదవ్యాస్, వెంకటేశ్, సాయి శిరణ్మయి పాల్గొన్నారు.

యూరియా వాడకం తగ్గించాలి

సాగు పద్ధతులపై అవగాహన సదస్సులో భద్రాద్రి కలెక్టర్ జితేశ్ వి పాటిల్

మాట్లాడుతున్న కలెక్టర్ జితేశ్ వి పాటిల్

చుంచుపల్లి, మే 5 : రైతులు పంటల సాగులో యూరియా వాడకం తగ్గించాలని, అవసరం మేరకు రసాయన, పురుగు మందులను పిచికారీ చేయాలని కలెక్టర్ జితేశ్ వి పాటిల్ అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం, ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ వ్యవసాయ విశ్వవిద్యాలయం సంయుక్తంగా మెరుగైన సాగు పద్ధతులపై జిల్లా రైతులకు అవగాహన కల్పించే దిశగా సోమవారం నుంచి ఈ నెల 13వ తేదీ వరకు రైతు ముంగిట్లో శాస్త్రవేత్తలు కార్యక్రమాన్ని చేపట్టారు. పెనగడప గ్రామంలో ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు, కలెక్టర్ జితేశ్ వి పాటిల్ ఈ కార్యక్రమాన్ని ప్రారంభించారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ నేల సారాన్ని కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రతీ రైతుపై ఉన్నదని, విచ్చలవిడిగా రసాయనాలు వాడితే నేల సారం పూర్తిగా దెబ్బతినే ప్రమాదం ఉందన్నారు. సాగుకు ముందే పంట మార్పిడి దిశగా రైతులు ఆలోచన చేయాలని, మునగ, ఆయిల్‌పామ్, వెదురు లాంటి లాభదాయక పంటలు వేసుకోవాలన్నారు. ఎమ్మెల్యే కూనంనేని మాట్లాడుతూ వ్యవసాయంతోపాటు అనుబంధ రంగాల వైపు రైతులు ఆసక్తి చూపాలని, సాగు ద్వారా ఆదాయం పెంపొందించుకునేందుకు కేవీకే శాస్త్రవేత్తల సేవలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. కేవీకే ప్రోగ్రాం కో ఆర్డినేటర్ డాక్టర్ వి.లక్ష్మీనారాయణమ్మ, శాస్త్రవేత్తలు బి.శివ, కొత్తగూడెం ఏడీఏ నరసింహారావు, చుంచుపల్లి ఏవో రాజేశ్వరి, ఏఈవో మమత, పంచాయతీ సెక్రటరీ, రైతులు పాల్గొన్నారు.

కొర్రీలు పెట్టకుండా ధాన్యం కొనాలి..

సుజాతనగర్ ప్రధాన రహదారిపై ధర్నా

సుజాతనగర్ ప్రధాన రహదారిపై ధర్నా చేస్తున్న రైతులు

కొత్తగూడెం టౌన్, మే 5 : కొర్రీలు పెట్టకుండా, సాకులు చెప్పకుండా ధాన్యం కొనుగోలు చేయాలని డిమాండ్ చేస్తూ రైతు సంఘం ఆధ్వర్యంలో రైతులు సుజాతనగర్ మండల కేంద్రంలో ప్రధాన రహదారిపై సోమవారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ కొనుగోలు కేంద్రానికి తరలించిన ధాన్యంలో తేమ శాతం ఎక్కువగా ఉందని చెబుతూ వెనక్కి పంపిస్తున్నారని ఆరోపించారు. ప్రస్తుతం కురుస్తున్న అకాల వర్షాలతో తడిచిపోయిన ధాన్యాన్ని ప్రభుత్వమే కొనుగోలు చేసి రైతులను ఆదుకోవాలని కోరారు. కార్యక్రమంలో నల్లగోపు పుల్లయ్య, దిండు లక్ష్మణ్, తంగెళ్ల వెంకటయ్య, కత్తి నరసింహారావు, శ్రీనివాస్, గడ్డం లక్ష్మణ్‌రావు, దేవయ్య, కొండ తదితరులు పాల్గొన్నారు.

కొణిజర్లలో రైతుల రాస్తారోకో

- వెంటనే ధాన్యం దిగుమతి చేసుకోవాలని డిమాండ్
- వైరా-సత్తుపల్లి జాతీయ రహదారిపై ఆందోళనతో ట్రాఫిక్ జామ్

కొణిజర్ల మండల కేంద్రంలో వైరా-సత్తుపల్లి జాతీయ రహదారిపై ఆందోళన చేస్తున్న రైతాంగం

కొణిజర్ల, మే 5 : కాంటా వేసిన ధాన్యాన్ని మిల్లుకు తరలించినా దిగుమతి చేయకపోవడంతో ఓపిక నశించిన రైతులు ఆందోళనకు దిగారు. కొణిజర్ల మండల కేంద్రంలోని ప్రధాన కూడలి వైరా-సత్తుపల్లి జాతీయ రహదారిపై సోమవారం రాస్తారోకో చేయడంతో భారీగా ట్రాఫిక్ స్తంభించిపోయింది. రైతుల ఆందోళనకు సీపీఎం, రైతు సంఘం జిల్లా కార్యదర్శి బొంతు రాంబాబు, సీపీఐ(ఎంఎల్) మాస్‌లైన్ నాయకులు పీవై పుల్లయ్య, కంకనాల అర్జునరావు తదితరులు మద్దతు పలికారు. డీఎస్‌వో చందన్‌కుమార్‌ను ఘెరావ్ చేశారు. కొణిజర్ల మండలంలో ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాల్లో సేకరించిన ధాన్యాన్ని కాంటా వేసి.. ఐకేపీ, సొసైటీ, డీసీఎంఎస్ సిబ్బంది ట్రక్‌షీట్ రాసి కొణిజర్లలోని శ్రీశ్రీనివాస రైస్ మిల్లుకు తరలించారు. ఆ ధాన్యాన్ని వారం రోజులుగా దిగుమతి చేయకపోవడంతో రైతులు ఈ విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లారు. సోమవారం మధ్యాహ్నం డీఎస్‌వో చందన్‌కుమార్ మిల్లు వద్దకు చేరుకొని మిల్లుకు కేటాయించిన ధాన్యం కోటా 15 వేల క్వింటాళ్ల నిల్వ సామర్థ్యం పూర్తయిందని, ధాన్యం వాహనాలను వైరాలోని ఓ మిల్లుతోపాటు హనుమకొండ జిల్లాలోని మరో మిల్లుకు తరలించాలని సూచించారు. దీంతో కోపోద్రిక్తులైన రైతులు ట్రక్‌షీట్‌లో కొణిజర్లకు చెందిన మిల్లు పేరు రాసి ఉంటే మరో మిల్లుకు తరలించాలనడం ఏమిటని ప్రశ్నించి రాస్తారోకోకు దిగారు. దీంతో ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం కలగడంతో విషయం తెలుసుకున్న ఎస్సై జి.సూరజ్, ఇన్‌చార్జి తహసీల్దార్ రాము, ఆర్ఐ రమేశ్, అశోక్ ఆందోళన వద్దకు చేరుకొని రైతులతో మాట్లాడారు. విషయాన్ని సివిల్ సప్లై ఉన్నతాధికారులకు తెలియజేశారు. ప్రస్తుతానికి మిల్లు వద్ద ట్రాక్టర్లలో ఉన్న ధాన్యాన్ని దిగుమతి చేసుకోవాలని అధికారులు యజమానికి సూచించడంతో అంగీకరించాడు. దీంతో రైతులు ఆందోళన విరమించారు.

ఇండ్ల కోసం మహిళల ఆందోళన

అనర్హులకు కేటాయించారని ఆరోపణ

కల్లూరు తహసీల్ ఎదుట ఆందోళన చేస్తున్న మహిళలు

పెనుబల్లి, మే 5 : అర్హులైన ప్రతీ నిరుపేదకు ఇండ్లు మంజూరు చేయాలని డిమాండ్ చేస్తూ చిన్నకోరుకొండి గ్రామానికి చెందిన మహిళలు కల్లూరు తహసీల్దార్ కార్యాలయం ఎదుట సోమవారం ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా పలువురు మహిళలు మాట్లాడుతూ తమ గ్రామంలో 42 మందికి ఇందిరమ్మ ఇండ్లు మంజూర్యాయని, అయితే అధికారులు అనర్హులు, ఆర్థిక స్తోమత కలిగిన, వ్యవసాయ భూములు ఉన్న వారికి ఇండ్లు మంజూరు చేశారని ఆరోపించారు. గ్రామంలో అధికారులు విచారణ జరిపి అర్హులైన నిరుపేదలకు ఇండ్లు మంజూరు చేయాలని కోరారు. అనంతరం తహసీల్దార్ కార్యాలయంలో వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో చిన్నకోరుకొండి గ్రామ మహిళలు జంపాల కృష్ణకుమారి, రాములమ్మ, జిల్లెల నాగమణి, జ్యోతి పాల్గొన్నారు.

గన్నీలు లేక.. కాంటాలు కాక..

- కుప్పలుగా దర్శనమిస్తున్న ధాన్యపు రాశులు
- కొనుగోలు కేంద్రాల్లో ఆందోళన చెందుతున్న రైతులు

కొనుగోలు కేంద్రంలో ధాన్యపు రాశులు

చండ్రుగొండ, మే 5 : కొనుగోలు కేంద్రంలో గన్నీ బ్యాగుల కొరత ఏర్పడడంతో రైతులు తీవ్ర ఆందోళన చెందుతున్నారు. అసలే వాతావరణం రోజుకో తీరుగా ఉండడం.. ఎప్పుడు వర్షం కురుస్తుంతో.. ఎప్పుడు ఎండ వస్తుందో తెలియక సతమతమవుతున్నారు. ఈ క్రమంలోనే గన్నీలు లేక చండ్రుగొండ మండలం దామరచర్ల కొనుగోలు కేంద్రంలో సోమవారం కొనుగోళ్లు నిలిచిపోయాయి. ప్రధానంగా ధాన్యం కొనుగోలు కేంద్రంలో ఐదు లారీల వరకు ధాన్యం కాంటాలు వేసేందుకు వీలుందని, అయితే అధికారుల పర్యవేక్షణ లేకపోవడంతో కాంటాలు సక్రమంగా కావడం లేదని పలువురు రైతులు ఆరోపించారు. మరోవైపు అకాల వర్షాలతో విక్రయానికి తరలించిన ధాన్యాన్ని కాపాడుకునేందుకు నానా తంటాలు పడాల్సి వస్తుందని ఆవేదన చెందుతున్నారు. కనీసం గన్నీ బ్యాగులు ఉన్నాయో.. లేదో.. చూసుకోవాల్సిన బాధ్యత నిర్వాహకులపై లేదా.. అని వారు మండిపడ్డారు. ధాన్యం కొనుగోళ్ల విషయంలో ప్రభుత్వం విఫలమైందన్నారు. సంబంధిత అధికారులు స్పందించి నిత్యం ధాన్యం కాంటాలకు సరిపడా గన్నీ బ్యాగులను అందుబాటులో ఉండేలా చూసుకోవాలని రైతులు కోరుతున్నారు.